**వృత్తి యేదయినా, ఆడదాని చిత్తవృత్తి మనసయినవాడితో మనువుమీదనే వుంటుంది. అందుకు "డబ్బు" అడ్డమొస్తే ఆ కథకు ముగింపు యేమిటి?**

# ముగింపులేని కథ

పైడిపాల

ధర్మరాజు గారింట్లో పెళ్ళి.

ఆయన సొంత కూతురి పెళ్ళి.

సొంత కూతురు కాకపోతే అరువు కూతురు కూడా వుంటారా?

వై నాట్? డబ్బున్న వాడి కేమైనా వుండొచ్చు! ధర్మరాజు బిజినెస్ మాగ్నెట్. 'లక్ష' అని స్పష్టంగా ఉచ్చరించడం చేత కాదు. కాని లచ్చలు సంపాయించాడు.

అందులో ఓ రెండు లచ్చలు పెట్టి రెండో కూతురికి ఓ మొగుణ్ని కొంటున్నాడు

ఆ కొనబడుతున్నవాడు కూడా డబ్బున్న వాడే కాబట్టే మైసూరులో ఇంజనీరింగ్ డొనేషన్ మీద వెలిగిస్తున్నాడు.

ఏవయితేనేం? ఉడ్‌బి ఇంజనీరు పెద్దల్లుడు వుడ్‌బి డాక్టరు. ముందు ముందు (ఎంతమంది ప్రాణాలు తీసినా) రెండు చేతులా సంపాయిస్తారు ఇద్దరల్లుళ్ళూ!

సంపాదించకపోయినా వెనక పెద్దలు కూడబెట్టి యిచ్చిన ఆస్తిపాస్తులున్నాయి.

కనుకనే వాళ్ళు ధర్మరాజు అల్లుళ్ళయారు. డబ్బు డబ్బును ప్రేమిస్తుంది

అందుకే మరి డబ్బున్న వాళ్ళంతాధర్మరాజు కూతురి పెళ్ళికి స్కూటర్ల మీద, చిన్నకారల మీద వచ్చి వాలారు.

వాహనాలమీద వచ్చిన వాళ్ళంతా ధన కనక వస్తువుల్ని కానుకలుగా తీసుకొచ్చారు.

పందిట్లో డబ్బులేని వాళ్ళూ ఉన్నారు. బాండ్ మేళం, భోగం మేళం, సన్నాయి మేళం వగయిరా..

ఆ వగయిరాలో ఒక భాగం సేవక బృందం. ధర్మరాజు పందిట్లో పడక కుర్చీలో కూర్చుని చుట్ట వెలిగించి ఆర్డర్లు జారీ చేస్తుంటె సర్వం చక్కబెట్టుకొని పోయేవాళ్ళు.


ఆయన ఆజ్ఞల మేరకి ఓ పక్క మందు గుండు సామాను కాలుస్తున్నారు.

మరో పక్క మేజువాణీని ఆడిస్తున్నారు.

ఇంకో పక్క బేండ్ మేళం సరికొత్త సినిమాట్యూన్లని వినిపిస్తున్నారు.

అంతటా ఫొటోగ్రాఫర్లు హడావిడిగా తిరుగుతున్నారు.

పెళ్ళికొడుకు, కూతురు కూర్చుంటే ఫొటో, నిల్చుంటే ఫొటో, కదిలితే ఫొటో, మెదిలితే ఫొటో.



ధర్మరాజుగారి తోడలుడు పెళ్ళికొడుకు కజిన్. పెళ్ళి కొడుక్కి పెళ్ళికూతురు కూతురు. అంచేత అలా అనొచ్చు.

అంటే అనొచ్చు. కాని ఈ వరస సక్రమమా ?- ఈ పెళ్ళి చెయ్యొచ్చా?

ఇలాంటి చవట ప్రశ్నలు అడకూడదు. డబ్బున్నగర అక్రమం అనేదిలేదు. అంతా డబ్బులీల. భూమి ధనవంతుడి చుట్టూ తిరుగుతోంది.

భోగం మేళంతో ఆడపిల్లలు ట్రాన్స్ పరెంటు చొక్కా జేబుల్లోంచి పచ్చకాగితాలు కనిపిస్తున్న సోగ్గాళ్ళచుట్టూ తాంబూలా లివ్వడానికి తిరుగుతున్నారు.

వధూవరుల చుట్టూ మంత్రాలు వల్లిస్తూ పురోహితులు తిరుగుతున్నారు.

వాళ్ళవాళ్ళ చుట్టూ ఫొటోగ్రాఫర్లు తిరుగుతున్నారు.

పందిరిచుట్టూ అలంకరించిన లైటింగ్ బోర్డుల్లో లైట్లు గమ్మత్తుగా తిరుగుతున్నాయి.

ఆరిందాలు పట్టు చీరలతో హడావిడిగా అటూ యిటూ తిరుగుతున్నారు.

నాగినీ నృత్యం చేస్తున్న భోగంపిల్ల పాములా మెలికలు తిరిగిపోతోంది

కాలి బొటనవేలిని తొక్కుతున్న పెళ్ళి కొడుకుని చూసి పెళ్ళికూతురు సిగ్గుతో వంకర్లు తిరిగిపోతోంది.

గడియారం తిరుగుతోంది.

మంగళసూత్రధారణ జరుగుతోంది.

సన్నాయి మేళం విజృంభించింది.

"శతమానం భవతి" .... పురోహితుల మంగళాశీస్సులు మైకులో మార్మోగుతున్నాయి.

"సీతారాముల కళ్యాణం చూతము రారండి" బాండ్ మేళం సందర్భోచితంగా పాటను అందుకున్నారు.

పెళ్ళిపెద్దల అక్షింతల పూలవర్షం కురుస్తోంది.

ధర్మరాజు నియమించిన ఫొటోగ్రాఫరుకి రీలు అయిపోయింది. కంగారుగా రీలు మార్చుకుంటున్నాడు.


ఫొటో తీసేవరకు ముళ్ళేస్తున్న పెళ్ళి కొడుకు, పెళ్ళికూతురు బంగారు జడను పైకెత్తి పట్టుకున్న ఆరిందా.... స్టిల్ పోజ్!

"అలా నిలబడి పోయావేం - ఆడు" పైజమా లాల్చీవాడి గద్దింపుకి ఉలిక్కి పడింది రత్నపాప.

రత్నపాప ఆ మేళంలో కుర్రది. జనాన్ని వెర్రెత్తిస్తోంది.

వెర్రిజనం దృష్టి పాపమీద. పాపం పాప చూపులు పెళ్ళితంతుమీద

పెళ్ళి వేడుక చూస్తూ నిల్చుండి పోయిన



"మేరీమాత"

ఫొటో : పి.డి. ప్రకాశరావు, ధవళేశ్వరం

పాప కళ్ళలో అశ్రువులు.

పాప మెదడులో ఆలోచనలు....

పెళ్ళికూతురు తన ఈడుదే. తన కంటె అందగత్తె కాదు. మరి తన కెందుకు పెళ్ళవదు?

పురోహితుడు బియ్యం పళ్ళాలు వధూవరుల కందించాడు వాళ్ళు పోటీపడి తలంబ్రాలు పోసుకుంటున్నారు.

ముత్యాల వానలో బంగారు బొమ్మల్లా వున్నారు వధూవరులు.

ఓ క్షణం కెమెరా వంక చూడమన్నాడు ఫొటోగ్రాఫర్ - స్టిల్ పోజ్!

పాప ఆడింది. పాడింది. అలసిపోయింది.. అలసిపోయిన పాప కళ్ళ ముందు మసక మసకగా అతని రూపం.

తెల్లటి పాంటూ షర్టూ. సన్నగా పొడవుగా వున్న పసిమి పచ్చని ఆకారం. సూదంటు రాయిలాంటి చురుక్కు ఎక్స్రేల్లాంటి చూపులు.

సాయంత్రంనుంచి అలాగే చూస్తున్నాడు. పదను దొరికినప్పుడల్లా అక్కడే ఆ పందిరి గుంజ దగ్గరే నిల్చొని చూస్తున్నాడు.

ఆ చూపులో మూగకోరిక ఆ రూపులో ముగ్ధమోహనత్వం

'ఎక్కడివాడో... కాని చక్కని వాడే'

ఎదురుగా రాడు.. ఏమీ అడగడు.. ఎవరీ ప్రవరుడు?

ఇలాంటివాడు తనని పెళ్ళాడితే....?

ఇలాగ పీటలమీద కూర్చొని తలంబ్రాలు పోసుకుంటుందే?....

'అలివేలూ పాపను మళ్ళీ ఆడిస్తే పాతికిస్తా' నిషాలో వున్న పెద్దమనిషి నాయకురాలి 'కెర' చూపించాడు. పాప కల చెదరి పోయింది.

"పాడమంటే పాడేది పాట కాదు"

రత్నపాప మళ్ళీ అభినయించక తప్పలేదు.

## 2

రత్నపాప స్నేహితురాలితో కలిసి గుళ్ళో కెళ్ళింది.

భోగం పిల్లకి దేవుడిపూజ కూడానా?

ఏం - పురుషుడి పూజకేకాని దేవుడి జకి పన్చెయ్యదా భోగం పిల్ల?

ఏమో-పబ్లిసిటీ కోసమేమో!

గుడికొచ్చే మిగతా ఆడపిల్లల్ని (మన చెల్లెళ్ళను, పెళ్ళాలను కలుపుకొని) అలా ఎందుకనుకోగూడదు?

కళ్ళుపోతాయి!

రత్న పాప అందాన్ని చూసి కుర్రకారు కళ్ళు చెదిరిపోతున్నాయి.

చెదిరిపోయిన కల గుర్తుకొచ్చింది పాపకి.

ధర్మరాజు గారింట్లో పెళ్ళి పందిట్లో తనవైపు ఆరాధనా పూర్వకంగా చూసిన ప్రవరుడు.. తన కలల రాకుమారుడు మళ్ళీ కనిపిస్తే....?

ఎలా కనిపిస్తాడు....? ఎనిమిది మైళ్ళ దూరం!

ఎనిమిదిమైళ్ళుకాదు. ఎనభైమైళ్ళయినా ప్రేమ కడ్డం లేదు.

అయితే అతను తనని ప్రేమిస్తున్నాడా?- అసలు తను అతనిని ప్రేమిస్తోందా?—

ఏమో!

ఏమో అనుకుంటే తనకి కలల్లో.... ఆలోచనల అలల్లో.. ఊహల్లో....

'హలో'

వెనుదిరిగింది పాప. అతను!

"మీతో మాట్లాడాలి" తల వంచుకున్నాడు.

ఉక్కిరిబిక్కిరయింది పాప. ఇలా తారసపడ్డం ప్రబంధాల్లో పురాణాల్లో సినిమాల్లోలా!

ఫ్రెండ్ చెవిలో గుసగుస లాడింది. ఆమె పరిహాస మాడింది.

కలల హంస ననుసరిస్తూ కలహంసలా నడిచింది.

చాలసేపు అతను మాట్లాడలేకపోయాడు. తడబడుతున్న మాటలు అతని భావాల కర్థం పట్టలేకపోయాయి.

అతని మనసు పాప కర్థమయింది.

ఆమె కిష్టమయితే అర్ధాంగిగా జీవితంలోకి ఆహ్వానిస్తున్నాడు.

కాని పెద్దలంటే భయం. వాళ్ళ పెళ్ళికి ఒప్పుకోరు. అతని వెనక మూలుగుతున్న డబ్బుంది. కాని అతను మబ్బులో మెరుపు కోసం ఆశ పడుతున్నాడు.

ఆశ పెట్టడంలేదు. ఉన్నదున్నట్టు చెపుతున్నాడు.

ప్రస్తుతానికి ఎక్కడికయినా వెళ్ళి పెళ్ళి చేసుకుందామంటాడు....పాపకోరిక మేరకు కల్యాణమంటపంలోనే!

మనసిచ్చినవాడు భయస్తుడు... కాదనలేదు అవుననలేదు. ఆలోచించి చెప్తానంది.

అతను సరేనన్నాడు....తొందరపడి సరిహద్దులు చెరపలేదు.

ఆ అందీ అందని చంద్రుడు 'కుమార్' ధర్మరాజుగారి ఏకైక కుమారుడు!

## 3

పాప కోరిక విన్న వరాలుకి కోపం ముంచుకొచ్చింది.

వరాలు రత్నపాప అవ్వ. పాపకి కనకాభిషేకం చేయించాలని ఆవిడ పూనిక.

కూతురు మాణిక్యం పురుట్లో ధనుర్వాతం వచ్చి కళ్ళు మూస్తూ తన చేతుల్లో ఈ రత్నాన్ని పెట్టి వెళ్ళిపోయింది.

పాప నిజంగా అనావిద్ధ రత్నం. అనాఘ్రాత పుష్పం!

పాపంటే జనానికి రోజు రోజుకీ మోజు పెరిగిపోతోంది.

మోజున్న మారాజుని చూసి కన్నెరికం చేయించాలని అవ్వ ఆశ.

ఆ ఆశకి మంగళారతిపాడి ఎవడ్నో ప్రేమించానంటుందీ పిచ్చిపిల్ల.

తమ కులంలో ప్రేమించడం నేరం. ప్రేమించినట్టు నటించాలి అంతే.


# BHARAT ENTERPRISES

(Regd No : 250/78)

**FINANCE & SAVINGS**

MIHIJAM—815354 (BIHAR)

"బీహార్ గ్రూప్"లో మీ పేరు నమోదు చేయించుకోండి. మీరు చేయవలసిందల్లా ప్రతి నెల రు. 25/- చొ॥న 20 నెలలు మాత్రమే చెల్లించాలి మీకు ఒక నంబరుగల పాస్ బుక్ పంపబడును. ఆ పాస్ బుక్ మీకు 60 నెలలు స్కీము చివరవరకు వుండును.

## ఋణ సౌకర్యం

*పూర్తి 20 నెలల సభ్యత్వపు సొమ్ము రూ. 500/- మరియు "లోను" సర్వీసింగ్ ఛార్జీలు రూ. 15/- మొత్తం రూ 515/- 31-12-78 లోగా కట్టిన సభ్యునకు 35 రోజులలో రూ. 5,000/-ల వరకు ఋణం మంజూరు చేయబడును. ఋణం పొందుటకు ఎట్టి విధమైన సెక్యూరిటీలు అవసరం లేదు* LOAN APPLICATION FORM *కావలసినవారు* Head Office *నకు వ్రాయవచ్చును.*

*మీరు చెల్లించు సొమ్మునకు పూర్తి సెంట్రల్ బ్యాంకు గ్యారంటీ కలదు.*

మొత్తం బహుమతులు : రు. 38,40,000/-

మొత్తం సభ్యులు : 99,999.

మీ మొదటి నెల/20 నెలల సొమ్ము సెంట్రల్ బ్యాంకు డ్రాఫ్టు/M O./I. P. O. ద్వారా నేడే పై అడ్రసునకు పంపండి.

గమనిక : "బీహార్ గ్రూప్" 31-12-78 తేదీతో ముగియును. 1-2-79 తేదీ నుండి రెండు కొత్త గ్రూపులు ప్రారంభమగును.

అంతకు మించిన అనంత ఏమైంది?- ప్రేమ ప్రేమని ఓ కవిగాడి వెంటబడి ఆనక అడుక్కు తింది.

'వయసులో వున్న కుర్రాడి మాట, ఎలచ్చన్లో నాయకుడి మాట నమ్మొద్దే, మత్తు దిగిపోతే మోహం కూడా చూడరు"- ఇది వరాలి సలహా.

"మోహంలో ఆ మాటంటున్నాడు కాని అంత డబ్బున్న వాడు- పైగా పిరికసన్నాసి


ఉచితం ఉచితం ఉచితం

తెల్ల మచ్చలు

మా చికిత్సవల్ల తెల్లమచ్చలు గల వారికి పూర్తిగా నయం అవడం ద్వారా మా వైద్యం మంచి కీర్తినిపొందింది. ప్రచారం నిమిత్తం ఒక ప్యాకెట్టు మందు ఉచితంగా ఇవ్వబడును. మొదటి కోర్సు లో నే మచ్చల రంగు మారడం ఆరంభమవు తుంది. జబ్బు వివరాలు వ్రాయండి.

GAUTAM CHIKITSALAYA (S-DD)

P. O. KATRI SARAI (GAYA)



దీర్ఘ వ్యాధులకు ఉత్తమ సిద్ధ వైద్యం!



హస్తప్రయోగం, అంగము చిన్నదై అవపర కాలమందు అసంతృప్తి, శుక్లనష్టము, నపుంసకత్వము, హెర్నియా, చర్మవ్యాధులు, పోస్టు ద్వారా కూడా వైద్యం చేయబడును. వరిబీజము(బుడ్డ), మూత్ర వ్యాధులు ఆపరేషన్ లేకుండ రండి.

డా॥ దేవర, ఫోన్ 551, మార్వాడి గుడివద్ద, తెనాలి.

SUVARNA

బ్రాంచి : ... బోగ్ రోడ్, మద్రాసు-17



REGD

వాదండి ముఖ్యంగా ...

క్రమముగా ... బాధలో కూడిన, ...

SEALED PACKING ... TABLETS
AVAILABLE AT ALL CHEMISTS

Mfrs: SEENU & CO., MADRAS-21


నీతో వుంటాడంటావా?- నీ భ్రమ కాని"- ఇది వరాలి హెచ్చరిక!

"మనం దులిపితే ఏ చెట్టయినా నాల్రోజులే. అంచేత పూసిన మొక్కనల్లా చూసుకోవాలి గాని పెరట్లో మొక్క నాటతా నంటావేటే ఎర్రిదానా"- ఇది వరాలి పాఠం!

ఎన్ని చెప్పినా పాప చెవికెక్కలేదు. చివరకు వరాలికి కోపం తలకెక్కింది.

'ఈ పిల్ల ముండకి ప్రేమ పిచ్చి పట్టింది. లేటుసేతే పెమాదం' అనుకొంది.

పిట్ట పారిపోకుండా వల కట్టుదిట్టం చేసింది.

వారం రోజులు తిరక్కుండానే వరాలు సంబర పడిపోతూ పాపకో వార్త చెప్పింది.

పాపపేర నాలుగెకరాల భూమి రాసి కన్నెరికం చేస్తానని కబురంపాడు ధర్మరాజు!

ధర్మరాజు పేరు విని కంపించి పోయింది పాప. 'సారంగధర' కథ గుర్తు కొచ్చింది.

తను చిత్రాంగి కాదు.... మోసంచేసే ఉద్దేశంలేదు. మనసున్న మనిషి!

'మనసు సిలకలాంటిది. దాన్నెలా పలకమంటే అలా పలుకుతుంది'

వరాలెంత నచ్చజెప్పినా పాప విని పించుకోలేదు. ధర్మరాజుని తిట్టి పోసింది. శిలలు కరిగేలా ఏడ్చింది.

అయినా వరాలు గుండె కరగలేదు. దాని కళ్ళముందు కుబేరుడు కనిపిస్తున్నాడు.

పాప ఎంత మొరపెట్టుకున్నా విని పించుకోలేదు వరాలు. ఆ మర్నాడే "కన్నెరికం" ఏర్పాటు చేసింది.

మైకు, పందిరి, బంధువులు, హడావిడి అదో పెళ్ళిలా వున్న యజ్ఞం. పాప బలి పశువు.

ఆ రాత్రి పెద్దాపురం సిల్కులాల్చీ, గ్లాస్కోపంచె కట్టుకొని, "మై ఛాయిస్" సెంటు పూసుకొని గదిలో కొచ్చాడు ధర్మరాజు.

చేతి వేళ్ళకున్న పొళ్ళ వుంగరాల మధ్య బంగారపు ఉంగరం మీద వెంకటేశ్వరస్వామిని బంధించి - హుందాగా రంగేసిన మీసాన్ని చేత్తో సవరించి నవ్వుతున్నాడు.

ఆ నవ్వు పాపకి ప్రళయకాల గర్జనలా వుంది.

అతని రూపు దున్నపోతులా వుంది.

అతని చూపు తోడేలులా వుంది.

పాప అతని పాదాలమీద పడింది. ధర్మరాజు పాప పెదాలపైకి ఎగబడ్డాడు.

పాప చేతులెత్తి దణ్ణం పెట్టింది. ధర్మరాజు చేతులుచుట్టి పాపను పట్టాడు.

ధర్మరాజుని తాపం ఆవహించింది. పాపని కోపం ఆవహించింది.

పరువంతో ఎగసి పడుతున్న పాప గుండెలు....ధర్మరాజు గుండెల్లో గుబులు.

ధర్మరాజు దగ్గరగావచ్చి చెయ్యి పట్టుకున్నాడు. పాప టేబుల్ మీద వుంచిన ఆపిలు కోసే చాకు పట్టింది.

పాప ధర్మరాజు గుండెలో బలంగా ... కు గుచ్చింది!

ధర్మరాజు హాహాకారాలు నింగినంటాయి - నెత్తుటితో ఎర్రబడిన నేల పశ్చిమ దిక్కులా వుంది!

# 4

బోనులో రత్న పాప ఆడపులిలా వుంది. అధర్మ నిధనం చేసే కాళిలా వుంది.

ఆమె చూపులకి నల్లకోట్లు, నల్లనోట్లు తడబడుతున్నాయి.

పాప తరఫున వకీల్ని పెట్టుకోలేదు.

పాపం తరఫున కాని.... న్యాయానికి వకాల్తా వద్దండి.

పి.పి. కథనం విన్నాక జడ్జి అడిగాడు, 'ఏమైనా చెప్పుకొంటావా' అని.

ఎవరికి చెప్పుకున్నా వినిపించని గోడు నాది.

త్రేతాయుగంలో పరస్త్రీని వాంఛించిన రావణుణ్ని రాముడు పరిమార్చాడు.

ద్వాపరంలో ద్రౌపదిని కామించిన కీచకుణ్ణి భీముడు వధించాడు.

కలియుగంలో ఈ ధర్మరాజుల్ని తుద ముట్టించే నాథులు మాకు లేరు!

మాకు మగడుండటం నేరం. ప్రేమించటం నేరం.

అది మా కులానికి నచ్చదు. ఈ సమాజమూ మెచ్చదు.

ఇక్కడ డబ్బున్న వాళ్ళకి కన్నకూతురు పెళ్ళి చెయ్యడంలాగే భోగం పిల్లకి కన్నెరికం చెయ్యడం కూడా విద్యుక్త ధర్మం!

మరి ఈ దుర్మార్గాల్ని తుడిచిపెటడానికి "సంభవామి యుగే యుగే" అన్న ఏ నారాయణుడూ దిగిరాడు!

ఈ వ్యవస్థలో నేనింతకంటె ఏం చెయ్యాలో తెలియదు.

నన్ను శిక్షించండి. ఉరి తియ్యండి.

ఉరితీసేముందో చిన్న కోరిక!

కుమార్ ఇష్టపడితే దయచేసి తాళి కట్టించి మరీ వురి తియ్యండి. తృప్తిగా చనిపోతాను.

బొమ్మల్లా వింటున్న జనం మధ్య నిప్పుల ఉప్పెనలా రత్నపాప కంఠం వినిపిస్తోంది.